# నిర్భయ్ నగర్ కాలనీ

## ఫ్రీ డెలివరీ

మా కాలనీ నగరం బయట అఘోరించిందన్న విషయం మీకు తెలుసు కదా! మాదే కాదు. మాలాంటి మిడిల్ క్లాస్ పక్షులందరూ నగరానికి చాలా దూరంగా నెట్టివేయబడడం వల్ల వెలసిన కాలనీలు చాలా వున్నాయ్ మా చుట్టుపక్కల. ఈ కాలనీల్లో వాళ్ళెవరూ సాధారణంగా ఓట్లు వేయరు, వేసినా ప్రతిపక్షానికే వేస్తారు గనుక ఈ కాలనీల గురించి పట్టించుకునేవారెవరూ వుండరు.

ముఖ్యంగా మా నిర్భయ్‌నగర్ కాలనీ పరిస్థితి మరీ దారుణం. మంచినీళ్ళ సప్లయ్ వుండదు. రోడ్ల సంగతి మీకు తెలుసు కదా! లైట్లు సరేసరి! దోపిడీలకు వచ్చే దొంగలు టార్చ్‌లైట్స్ వేస్తేనేగానీ రాత్రిళ్ళు కాంతి ఎలా వుంటుందో తెలీదు.(రోడ్‌లాంటి చోట) రాత్రి తొమ్మిది దాటితే బస్‌లు కనిపించవ్. ఒకటే ఒక్క బ్యాంక్ వుందిగానీ అది నేషనలైజ్ అయిన దగ్గర్నుంచి వీలయినంత వరకు కస్టమర్స్‌ని చిత్రహింసలు పెట్టి ఎకౌంట్స్ ఎత్తేసుకుని పారిపోయేలా చేస్తోంది. ఎందుకంటే వర్క్ లోడ్ తగ్గించడానికని ఉద్యోగులు అనధికారపూర్వకంగా చెప్పారు.

ఇలాంటి పరిస్థితుల్లో ఓ రోజు తెల్లారుజామున నాలుగ్గంటలకు మా ఇంటి తలుపు గట్టిగా కొట్టడం వినిపించి మెలకువ వచ్చింది నాకు. చటుక్కున లేచి కూర్చున్నాను. ఒకవేళ దొంగలేమో అని అనుమానం వచ్చింది. కాలండర్ వేపు చూశాను. అవి నెలాఖరు రోజులు గనుక దొంగలుయి వుండరని అర్థమయిపోయింది. (వాళ్ళు సాధారణంగా జీతాలు వచ్చిన ఒకటి రెండు రోజుల్లోనే వచ్చేస్తారు). మా ఆవిడ నిద్రలో విశ్వామిత్ర విశ్వామిత్ర అంటూ కలవరిస్తోంది.

"ఏయ్ లేవే! ఎవరో తలుపు కొడుతున్నారు చూడు!" అంటూ గట్టిగా అరిచేసరికి ఉలిక్కిపడి లేచి గాబరాగా నా వేపు చూసింది.

"ఏవండీ! అన్నగారి విశ్వామిత్రను నిజంగా సుప్రీం కోర్టువాళ్ళు ఆపేశారా?" అంది కంగారుగా.

"నీ మొఖం! అదంతా నీ కలగానీ వెళ్ళి తలుపు తియ్. ఎవరో వచ్చారు" అన్నాను సర్దిచెప్తూ.

ఆమె అది కల అయినందుకు సంతోషిస్తూ వెళ్ళి తలుపు తెరచింది. శాయిరావ్ ఆదుర్దాగా లోపలి కొచ్చాడు. నాకు వళ్ళు మండిపోయిందతన్ని చూసేసరికి.

"ఏం బ్రదర్! నీకు రాత్రీ, పగలూ, తెల్లారు జామూ అంటూ తేడాలేమీ లేవా?" అన్నాను కోపంగా.

కానీ శాయిరావ్ మామూలుగానే నన్ను పట్టించుకోలేదు.

"అర్జంటుగా పద గురూ! మన కాలనీ రైటర్ చంద్రకాంత్ ఛటోపాధ్యాయ భార్యకు నొప్పులొస్తున్నాయట! అర్జంటుగా డెలివరీకి హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలి!" అన్నాడు హడావుడిగా.

నాకు నిద్రమత్తంతా ఎగిరిపోయింది.

అడపా దడపా ఇలాంటి సంఘటనలు జరగడం మామూలే మా కాలనీలో! అలాంటి సమయాల్లో ఎంత చిత్రవధ అనుభవించాలో కూడా మా అందరికీ అనుభవ పూర్వకంగా తెలుసు. ఇంక లాభం లేదని లేచి మా ఆవిడతోపాటు చంద్రకాంత్ ఇంటికి చేరుకున్నాను. బయటే రంగారెడ్డి, గోపాల్రావ్, యాదగిరి, జనార్దన్, డిటెక్టివ్ రచయిత్రి రాజేశ్వరి, పార్వతీదేవి అంతా నిలబడి వున్నారు. చంద్రకాంత్ వాళ్ళందరి మధ్యా తప్పు చేసినవాడిలా తలవంచుకుని నిలబడి వున్నాడు.

"అదికాదోయ్! మీ ఆవిడ ఏ రోజునయినా డెలివరీ అవవచ్చని తెలుసు కదా! తెలిసి కూడా ఊరిబయట కాలనీలో వుంచితే ఎలా అనుకున్నావ్? రెండ్రోజులు ముందే ఏదయినా ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో ఎందుకు చేర్పించలేదు?" కసురుకుంటున్నాడు రంగారెడ్డి.

"చేర్పిద్దామనుకున్నానుగానీ ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో అయితే 'సిజేరియన్' ఆపరేషన్ చేస్తారు కదా! దానికి బోలెడు డబ్బు కట్టాల్సి వస్తుందని — ఇంట్లోనే వుంచేశాను" అన్నాడు భయంగా.

మాకు అతని మాటలు సరిగ్గా అర్థంకాలేదు.

"ఏమిటి? సిజేరియన్ ఆపరేషన్ చేస్తారా? నీ కేం మతిపోలేదు కదా! సిజేరియన్ ఆపరేషన్ ఎందుకు చేస్తారు ఎవరయినా! డెలివరీ కష్టం అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో చేస్తారు" అన్నాడు గోపాల్రావ్.

"అవి పాత రోజులు గురూ! ఇప్పుడు కావాలని ప్రతివాళ్ళకీ సిజేరియన్ చేసేస్తున్నారు."

"ఎందుకలా?"

"ఫీజు ఎక్కువ వస్తుందని. మామూలు డెలివరీ అయితే బిల్ ఎక్కువ అవడం లేదని ఈ కొత్త పద్ధతి ఇంట్రొడ్యూస్ చేశారు. ఈ పద్ధతి కనిపెట్టాక ఇప్పుడు నర్సింగ్ హోమ్‌ల లాభం తెగ పెరిగిపోయిందట."

మా కేం చేయాలో తెలీలేదు.

"ఇప్పుడామెని గవర్నమెంట్ హాస్పిటల్ కెలా తీసుకెళ్ళడం?" అడిగాడు గోపాల్రావ్.

"ఎవర్నయినా ఆటోకి పంపించండి!"

మరుక్షణం జనార్దన్ ఓ మోపెడ్ మీద ఆటో వేటకు వెళ్ళిపోయాడు. అతను తిరిగి వచ్చేసరికి తెల్లారిపోయిందిగానీ ఆటో రాలేదు.

"ఆటో ఏమయింది?" అడిగాడు రంగారెడ్డి ఆదుర్దాగా.

"ఆటోలు ఎక్కడా లేవ్! ఒకే ఒక్కటి ఎన్టీఆర్ నగర్ దగ్గర్లో వుందికానీ దాని డ్రైవర్ ఉదయం ఎనిమిది గంటలగ్గానీ నిద్రలేవడట."

"మీటర్ మీద అయిదు రూపాయలు ఎక్కువిస్తానన్నా రాలేదా?" 

యర్రంశెట్టి శాయి

"వంద రూపాయలెక్కువిచ్చినా నిద్ర డిస్టర్బ్ అవనీడట. నేనేం గవర్నమెంట్ సర్వెంట్ ననుకున్నారా - ఒక టైమూ పాడూ లేకుండా పనిచేయడానికి?" అంటూ కసురుకున్నాడు.

అందరం మొఖాలు చూసుకున్నాం.

"ఏం చేద్దాం?" అడిగాడు శాయిరావు.

నేను టైము చూసుకున్నాను.

ఏడవుతోంది.

"ఎనిమిదయితేగానీ ఆటోలు మన కాలనీవరకూ రావు" అన్నాడు గోపాల్రావ్.

"అయితే అప్పటివరకూ ఆగుదాం! మనందరం కూడా అప్పటికి మొఖాలు కడుక్కుని రడీ అయిపోవచ్చు" అన్నాడు జనార్దన్.

అతని ఆలోచన బాగానే వుందని ఎవరిళ్ళకు వాళ్ళు బయల్దేరి మళ్ళీ ఎనిమిది గంటలకల్లా అందరం చంద్రకాంత్ ఇంటి దగ్గర ఎసెంబుల్ అయ్యాం.

చివరకు ఎనిమిదిన్నరకు ఓ ఆటో కనిపించింది.

అందరం పరుగుతో వెళ్ళి రోడ్డు కడ్డంగా చేతులు పట్టుకుని నిలబడ్డాం. మా చేతుల మధ్య నుంచి దూరిపోడానికి ప్రయత్నించి వెనుకకూడా ఇంకో రెండు వరుసల్లో మా కాలనీవాళ్ళు అడ్డంగా నిలబడడం వల్ల గత్యంతరం లేక ఆపేశాడతను.

అందరం కలసి అతనిని బతిమలాడాము.

రూల్స్ ప్రకారం అతనెలాగూ ఆటో నడపడన్న విషయం మాకు తెలుసుననీ, కేవలం జంటనగరాల పౌరుల మీద జాలితో, త్యాగనిరతితో ఆటో నడుపుతున్నాడన్న సంగతి మేము అర్థం చేసుకున్నామనీ చెప్పాము. ఎలాగయితేనేం, మీటర్ మీద పది రూపాయలు ఎక్స్ట్రా ఇవ్వడానికి మేమంతా ఆనందంగా అంగీకరించడంతో అందరం ఆనందంగా ఆటోని జాగ్రత్తగా కాపాడుతూ (వెనక్కు తిరిగి పారిపోకుండా) కాలనీలోకి తీసుకొచ్చాము.

చంద్రకాంత్ భార్యను ఆడాళ్ళందరూ కలసి ఆటోలోకి చేర్చారు. మా మిసెస్ ఆమెను జాగ్రత్తగా పట్టుకున్నాక ఆటో బయల్దేరింది.

మేమంతా వెనుక మా కాలనీవాళ్ళ మోపెడ్స్ మీదా, స్కూటర్ల మీదా బయల్దేరాం. సరిగ్గా చాదర్ ఘాట్ బ్రిడ్జ్ దగ్గరకొచ్చేసరికి పోలీస్ విజిల్స్ మార్మోగిపోయినయ్. కొంత మంది ట్రాఫిక్ పోలీసులు గట్టిగా కేకలు వేస్తూ మా ఆటోనీ, స్కూటర్లనూ మిగతా ట్రాఫిక్‌తోపాటు ఆపేశారు.

అన్నివేపులా ట్రాఫిక్ ఆగిపోయింది.

"ఇదేమిటి? ఎటోకొటు వెళ్ళనీయాలి కదా! అన్ని సైడ్లూ ట్రాఫిక్ అలా ఆపేశారేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరావు నన్ను.

శాయిరావు గొంతు వినడంతోనే ఓ ఇన్స్పెక్టర్ గట్టిగా కేకలు వేస్తూ మా మీదకు దూసుకొచ్చాడు.

"ఏయ్? తుమ్ లోగోంకో అకల్ నై హై క్యా? ఖామోష్ ఖడే హో జావ్" అన్నాడు శాయిరావుని కొట్టేట్లు చూస్తూ.

"అరె! ఎందుకాపారు అనడిగితే అంత కోపమెందుకండీ?" మొండిగా అడిగాడు శాయిరావు.

ఇన్స్పెక్టర్ ఇంకా మండిపడిపోయాడు.

"సైలెన్స్!" అంటూ ఫాక్టరీ సైరన్‌లా అరిచాడు.

దాంతో అందరూ నిశ్శబ్దమయిపోయాం.

ఈలోగా మా వెనుక ఎవరో ఆటోవాడు హారన్ కొట్టడంతో పిచ్చి కోపంతో అటువేపు పరుగెత్తాడతను.

"సాలే - కే నైరే హారన్ మారేసు? షరమ్ నై హై తేరేకో? సబ్ లోగ్ ఖామోష్ సే ఖడే హోజావ్!" అంటూ మరింత క్రూరంగా అరిచాడు.

అందరం సైలెంటయిపోయాము.

సెంటర్‌లో వైర్‌లెస్ సెట్ పట్టుకుని నిలబడ్డ మరో పోలీస్ అధికారి టైము చూసుకున్నాడు.

"ఆ! టైమయింది! విజిల్ వేయండి" అంటూ అరిచాడతను. నాలుగు వేపుల్నుంచీ పోలీస్ విజిల్స్ మార్మోగిపోయినయ్ మళ్ళీ.



అంతా ఆశ్చర్యంగా, అయోమయంగా చూస్తున్నారు.

"అమ్మా - అబ్బా -" అంది ఆటోలో నొప్పులు పడుతోన్న చంద్రకాంత్ భార్య.

ఆమె గొంతు వినడంతోనే "ఖామోష్" అంటూ భీకరంగా అరిచాడు మా ముందు నిలబడ్డ కానిస్టేబుల్.

ఇన్‌స్పెక్టర్ మండిపడుతూ మా ఆటో దగ్గర కొచ్చాడు.

"ఏయ్ ఎవళ్ళిక్కడ దిల్లగీ చేస్తున్రు" తీవ్రంగా అడిగాడు.

"ఆమెకు నొప్పులొస్తున్నాయండీ! అందుకని అరుస్తోంది."

"నొప్పులొస్తే డిస్ప్రిన్ టాబ్‌లెట్స్ వేసుకోమనవయ్యా! అరిస్తే ఎలా?" మరో కానిస్టేబుల్ మా దగ్గరకొచ్చాడు.

"ఆ నొప్పులు కాదండీ! ఆమెకు నెలలు నిండాయ్. డెలివరీకి హాస్పిటల్‌కి తీసుకువెళ్తున్నాం. ఇప్పటికే ఆలస్యం అయిపోయింది. మా ఆటోని వదిలేస్తే మేము వెళ్ళిపోతాం" చెప్పాడు రంగారెడ్డి.

ఆ మాట వినడంతోనే ఇన్‌స్పెక్టర్ కోపంగా రంగారెడ్డి దగ్గరకొచ్చాడు.

"మీ కేం దమాకున్నదా? రెండు నిమిషాలు నిలబడడానికి లొల్లి పెడత రేమయ్యా! అయినాగానీ ఆమె కిదే టైమ్ దొరికిందా నొప్పులు తెచ్చుకోడానికి?"

"కానీ ఇప్పటికి మమ్మల్ని నిలబెట్టి అయిదు నిమిషాలయింది కద్సార్" అడిగాడు శాయిరామ్.

"ఇగో - ఎక్కువ తక్కువ మాట్లాడకండ్రి. తొమ్మిది గంటలకెళ్లి తొమ్మిదీ రెండు నిమ్షాల వరకూ ఖామోషీ తోటుండాలి!"

"ఎందుకు సార్! ఇటు వేపు ఎన్టీఆర్‌గానీ, గవర్నర్ గానీ వెళ్తున్నారా?" అడిగాడు ఇంకో స్కూటర్‌వాలా.

"నిన్ననే పేపర్ల ఇచ్చినం ఇయాళ 'మార్టీర్స్ డే' అని! వదవలే నువ్వు? తొమ్మిది గంటలకెళ్ళి తొమ్మిదీ రెండు నిమ్షాల వరకూ పూరా శహర్ రుకాయిస్తదని టి.వి.లో గూడ జెప్పిన్రు! ఇనలే?" మరింత కోపంతో అన్నాడతను.

"మార్టీర్స్ డే అంటే ఏమది?" కుతూహలంగా అడిగాడు మా యాదగిరి.

ఇన్‌స్పెక్టర్ కొంచెం కన్‌ఫ్యూజయ్యాడు.

"ఏయ్ నీ యవ్వ - మార్టీర్స్ డే అంటే ఎరుక లేదువయ్యా? కైసే కైసే లోగ్ హై భయ్ యే శహర్ మే" అనేసి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

సరిగ్గా తొమ్మిది గంటలకు మళ్ళీ విజిల్స్ మ్రోగిపోయినయ్.

అందరం రెండు నిమిషాలు ఎప్పుడవుతుందా అని వాచీలు చూసుకోసాగాము. మా వెనుక పెరిగిపోతున్న వాహనాల హారన్స్, కేకలు, అరుపులు పెరిగిపోతూనే వున్నాయ్.

ఆటోలో చంద్రకాంత్ భార్య బాధతో వేసే కేకలు ఎక్కువయిపోతూనే వున్నాయ్. సరిగ్గా తొమ్మిది రెండుకి ట్రాఫిక్ కదిలేందుకు అనుమతి ఇచ్చారు పోలీసులు. అప్పటికే అన్నివేపులా ట్రాఫిక్ పెరిగి పోవడం వల్ల మామూలుగానే ట్రాఫిక్ జామ్ అయిపోయింది.

ఆ జామ్ నుంచి మేమూ, మా ఆటో బయటపడే సరికి పదయిపోయింది. అప్పటికే చంద్రకాంత్ భార్య నొప్పులెక్కువయిపోయి గట్టిగా ఏడ్చేస్తోంది.

"ఆటో త్వరగా పోనీ" అరిచాడు శాయిరామ్.

ఆటో డ్రైవర్ వేగం పెంచాడుగానీ మళ్ళీ పోలీసులు గట్టిగా విజిల్స్ వేస్తూ ఎక్కడి వాహనాలక్కడ ఆపేస్తూ కనిపించారు.

లాఠీతో మా వేపు దూసుకొచ్చి మా ఆటోనూ, స్కూటర్లనూ, మోపెడ్‌నీ రోడ్డు పక్కకు నెట్టేశాడు ఓ కానిస్టేబుల్.

"మళ్ళీ ఏమిటిప్పుడు?" కోపంగా అడిగాడు రంగారెడ్డి ఆ కానిస్టేబుల్‌ని.

"గవర్నర్ ఓల్డ్ సిటీలో 'పౌరుల ఇక్కట్లు' అనే సదస్సు ప్రారంభోత్సవాని కెళ్తున్నారు. ఆ కార్లు వెళ్ళేవరకూ ట్రాఫిక్ ఆగాలి."

"కానీ ఇవతల మా ఆవిడ పురిటి నొప్పులతో బాధపడుతోందయ్యా! త్వరగా ఉస్మానియా హాస్పిటల్ కెళ్ళాలి మేము" అన్నాడు చంద్రకాంత్ ఆదుర్దాగా.

"కుదరదండీ! గవర్నర్ వెళ్ళేవరకూ ఎవ్వరూ కదలడానికి వీల్లేదని మా అసిస్టెంట్ కమిషనర్‌గారు గట్టిగా చెప్పారు."

"అంటే డెలివరీ కేసుల్ని కూడా ఆపేసేయమన్నారా?"

"డెలివరీ ఏమిటి సార్? హార్ట్ ఎటాక్ కేసులయినా సరే! గవర్నర్ వస్తున్నారంటే నిలబడిపోవాల్సిందే!"

"ఈ లోపల ఆ పేషెంట్ హార్ట్ ఎటాక్‌తో ఎగిరిపోతే?"

"పోతే పోనీండి సార్! గవర్నర్ ప్రారంభోత్సవం కంటె ఎక్కువా ఒక ఆర్డినరీ సిటిజెన్ ప్రాణం?"

(ముగింపు వచ్చేవారం)

ఈ కథ పచ్చి అబద్ధం. అసలు ఈ ఇతివృత్తమే అతి దారుణమయిన కల్పితం. ఇందులోని పాత్రలూ, సన్నివేశాలూ, సంఘటనలూ, ప్రదేశాలూ, పోలీసులూ- అన్నీ కథా సౌలభ్యం కోసం కల్పించినవే! ఒకవేళ ఇందులోని చాలా అంశాలు (లేదా అన్ని అంశాలూ) మన రాష్ట్రంలోని ప్రజా జీవితాల్ని పోలి ఉన్నట్లయితే అది కేవలం పరమ కాకతాళీయం. ఈ కథలోని సంఘటనలన్నీ తెలుగు రాజధానిలో ఉండవచ్చునని ఎవరికయినా అనిపిస్తే అది వారి భ్రమ మాత్రమే! (ఎందుకంటే మన రాజధానిపౌరులు ఎలాంటి అసౌకర్యాలూ లేకుండా, సర్వసుఖాలతో తులతూగుతున్నారు కాబట్టి). ఈ కథలో కొన్ని దిక్కుమాలిన పాత్రలు వెలిబుచ్చిన అభిప్రాయాలతో గానీ, వాడిన దౌర్భాగ్యపు పద జాలంతోగానీ రచయితకు ఎలాంటి సంబంధంగానీ, బాధ్యతగానీ లేదని మనవి.

ఇట్లు
రచయిత


స్మృతి చిత్రాలు

భారతీయ భాషలలో ఇప్పటివరకు వెలువడిన పాపులర్ హిట్స్ నేపథ్యం...

సుప్రసిద్ధ పాత్రికేయుడు కె.ఎన్.టి. శాస్త్రి

రెగ్యులర్ ఫీచర్

వచ్చే సంచిక నుంచే ప్రారంభం!

సీరియల్

చేత వెన్నముద్ద